క్లుప్తంగా

ఎల్‌టీపీల సమస్యల పరిష్కారానికి కృషి



ఎల్‌టీపీ అసోసియేషన్ చైర్మన్ రామును సన్మానిస్తున్న ప్లానర్లు

గుంతకల్లుటౌన్: లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ప్లానర్)ల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ రాష్ట్ర చైర్మన్ వేల్పుల రాము అన్నారు. శనివారం స్థానిక ఎల్‌టీపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నికైన ఇంజనీర్ రామును లైసెన్స్‌డ్ ప్లానర్లు ఘనంగా సన్మానించారు. గుంతకల్లుకు చెందిన రాము రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా ఎన్నిక కావడం శుభ పరిణామమని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ అబ్దుల్‌సత్తార్, టీపీఎస్ మురళీ, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, ఎల్‌టీపీ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఇసాక్, కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నార్పల ఎస్‌ఐగా సాగర్

నార్పల: నార్పల ఎస్‌ఐగా సాగర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి వీఆర్‌కు వెళ్లగా తాడిపత్రి రూరల్ ఎస్‌ఐ సాగర్ నార్పలకు బదిలీ అయ్యారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిని ఎస్‌ఐ దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఐరన్ రాక్స్ విరాళం

గుత్తి: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి శనివారం 40 ఐరన్ రాక్స్‌ను విరాళంగా అందజేశారు. ఐరన్ రాక్స్ అందజేసిన ఆర్డీఓకు సీడీపీఓ ఢిల్లీశ్వరి, ఏసీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు కృతజ్ఞతలు తెలిపారు.

గుత్తి చెరువుకు నీరు విడుదల



వైటీ చెరువు వద్ద తూము ఎత్తుతున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతకల్లు మండలంలోని వైటీ.చెరువు పూర్తి స్థాయిలో నిండిన నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గుత్తి చెరువుకు నీరు విడుదల చేశారు. హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాల రాకతో కొద్ది రోజుల క్రితం గుంతకల్లు మండలంలోని కసాపురం వద్ద ఉన్న తూమును ఎత్తి పాతకొత్తచెరువు, వైటీ చెరువులకు కృష్ణా జలాలను విడుదల చేసిన విషయం విదితమే. కాగా కృష్ణా జలాలకు తోడు భారీ వర్షాలు కురిసి వరద నీరు పెద్ద ఎత్తున చేరడంతో వైటీచెరువు పూర్తిస్థాయిలో నిండింది. ఈక్రమంలో ఎమ్మెల్యే చెరువు తూము వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గుత్తి చెరువుకు నీరు విడుదల చేశారు.

ఇంటింటి సర్వే సమర్థవంతంగా నిర్వహించండి

గుంతకల్లు రూరల్: కొత్త ఓటరు నమోదు, ఓటర్ల జాబితాలో సవరణల కోసం చేపట్టిన ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల డీటీ ఆదినారాయణతో కలిసి ఆమె మట్లాడుతూ ఇంటింటా సర్వే కార్యక్రమం సెప్టెంబర్ 21వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



మాట్లాడుతున్న జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి కిశోర్

పెద్దపప్పూరు: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి కిశోర్ సూచించారు. మండలంలోని పసలూరు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను శనివారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి వైద్యసేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెల్త్ సెంటర్‌లో విమర్శలు రాకుండా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. అత్యవసర సమయాల్లో ఉన్నతాధికారుల సలహాలను తీసుకుని వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారిణి జరీనా, డాక్టర్ ఉషారాణి, హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్ వలి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భారతి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యులకు భద్రత కల్పించాలి



వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి. సెక్యూరిటీని పెంచాలి. వైద్యులు, సిబ్బంది భద్రతకు ప్రొటోకాల్ అవసరమని సుప్రీం కోర్టు అభిప్రాయ పడటం సంతోషంగా ఉంది. విధి విధానాల రూపకల్పనకు పది మందితో కూడిన టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని చెప్పడం హర్షణీయం. కేవలం ఆస్పత్రుల్లోనే కాకుండా మహిళలు పని చేసే అన్ని ప్రాంతాల్లో భద్రతను పెంచాలి. – శాంతి ప్రియ, వైద్యురాలు, గుత్తి



కఠిన చట్టాలు తేవాలి



కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం అమానుషం. ఇది సభ్యసమాజం తలదించుకునేలా ఉంది. దేవుడు.. తర్వాత దేవుడంతటి వారు వైద్యులు. అలాంటి ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి, హత్య చేయడాన్ని వైద్యరంగం జీర్ణించుకోలేక పోతోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు గట్టి చర్యలు చేపట్టాలి. భవిష్యత్‌లో ఇలాంటివి అరాచకాలు జరగకుండా కఠిన చట్టాలు తీసుకురావాలి.

– ఎస్.తిరుపతినాయుడు, వైద్యుడు, పామిడి

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్ నీళ్లు రోడ్డు పాలు
- పిచ్చి మొక్కలు, కంపచెట్లతో ముందుకు పారని జలాలు





గుంతకల్లులోని మస్తానయ్య దర్గా సమీపంలో ఉన్న జీఎస్‌బీసీలో పెరిగిన కంప చెట్లు, తిమ్మాపురం వద్ద కెనాల్‌పై నుంచి రోడ్డుపై పారుతున్న కృష్ణా జలాలు

గుంతకల్లు: అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ఇందుకు సజీవ ఉదాహరణ గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్ (జీఎస్‌బీసీ). నాలుగు రోజులుగా గుంతకల్లు నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీనికి తోడు కృష్ణ, తుంగభద్ర జలాలు నిండుగా జీఎస్‌బీఎస్‌లో వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విస్తారంగా కురుస్తున్న వర్షపు నీటితో జీఎస్‌బీసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. కానీ ఆ నీరు పూర్తి స్థాయిలో చంద్రనాయుని రిజర్వాయర్, చెరువులకు చేరడం లేదు. జీఎస్‌బీఎస్ నీరు కెనాల్ కట్టలను దాటుకుని పెద్దఎత్తున రోడ్డు మీద ప్రవహిస్తోంది.

ఆధునికీకరణకు నోచుకోని జీఎస్‌బీసీ

తుంగభద్ర ఎగువ కాలువలోని గుంతకల్లు శాఖలో భాగమైన గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్‌ను 1970లో తవ్వారు. దాదాపు 54 కి.మీ. పొడవుతో ఏర్పాటు చేసిన కాలవ పూర్తిస్థాయి ఆధునికీకరణకు నోచుకోవడంతో లేదు. గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్‌కు 1.63 క్యూసెక్కుల నీటిని కేటాయించారు. జీఎస్‌బీఎస్ కింద దాదాపు 16,000 ఎకరాల ఆయకట్టు ఉంది. అంతే కాకుండా గుంతకల్లు పట్టణంలోని రిజర్వాయర్లకు తాగునీటి అవసరాల నిమిత్తం ఈ నీటినే మళ్లిస్తున్నారు. ఆయకట్టుకు నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుండడంతో అనధికారంగా హంద్రీనీవా కాలవ నుంచి కృష్ణా జలాలను మళ్లిచుకుంటున్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి నీటి కేటాయింపులో జరుగుతున్న అన్యాయంపై, కాలవ ఆధునికీకరణపై గతంలో ప్రతి సమావేశంలోనూ అధికారులను నిలదీసేవారు.

కాలవ పొడవునా కంపచెట్లు..

ప్రస్తుతం జీఎస్‌బీసీ, పిల్లకాలువలు తూములు, డిస్ట్రిబ్యూటరీలు చెడిపోయాయి. అంతేకాకుండా కాలవ పొడవునా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోవడంతోపాటు పిచ్చి మొక్కలు వృక్షాలుగా మారాయి, ఇక గుంతకల్లు పట్టణం గుండా ప్రవహిస్తున్న కృష్ణాజలాలు కలుషితమవుతున్నాయి. కాలనీలకు చెందిన ప్రజలు ఇళ్లలోని చెత్తను, వ్యర్థాలను పడేస్తుండడంతో సమస్య తలెత్తుతోంది. కాలవ చిట్టడవులను తలపిస్తుడడంతో నీరు ముందుకుసాగక మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద కెనాల్‌పై నుంచి నీరుపారుతూ రోడ్డు పాలవుతుంది. జీఎస్‌బీసీ నిర్వహణకు కోసం గుంతకల్లులో ఓ పెద్ద కార్యాలయమే ఉంది. ఇక్కడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌తోపాటు అసిస్టెంట్ ఇంజనీర్లు, కింది స్థాయి సిబ్బంది ఉన్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి దాపురించింది. బ్రాంచ్ కెనాల్‌ను ఎప్పటికప్పుడు మరమత్తులు, జింగిల్ క్లియరెన్స్ చేసే నీటిని రిజర్వాయర్, చెరువులకు నింపడం ఈ కార్యాలయ సిబ్బంది ప్రధాన విధి. గట్టిగా అంటే మూడు, నాలుగు నెలలు మాత్రమే.. అదీ వర్షాకాలంలో మాత్రమే వారికి పని ఉంటుంది. అయితే కెనాల్‌ను అధికారులు ఏనాడూ పట్టించుకున్న పాపానపోలేదు. కనీస పర్యవేక్షణ చేసి ఉన్నా ఈ స్థాయిలో కాలవలో కంప చెట్లు పెరిగేవి కాదని రైతులు విమర్శిస్తున్నారు.

పనులు మధ్యలో నిలిపివేశాడు

గుత్తి సబ్ బ్రాంచ్ ఆధునికీకరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లు రాకపోవడంతో మధ్యలోనే పనులు నిలబెట్టారు. దీంతో కాలవలో కంపచెట్లు పెరిగాయి. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు కారణంగా తిమ్మాపురం గ్రామం వద్ద కెనాల్‌పై నుంచి నీరు పారుతుంది. వర్షాలు తగ్గ ముఖం పట్టడంతో నీటి ప్రవాహం తగ్గి కాలవ గుండానే నీరు రిజర్వాయర్, చెరువులకు చేరుతుంది.

– వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జీఎస్‌బీసీ

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



బీకేఎస్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు



కల్లూరులో సమ్మె చేస్తున్న సత్యసాయి కార్మికులు

బుక్కరాయసముద్రం: సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకుల రాఘవేంద్రాచారి డిమాండ్ చేశారు. శనివారం బీకేఎస్ మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం మూడో రోజుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు మంజూరు చేయలేదన్నారు. పెండింగ్ వేతనాలు మంజూరు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు దేవదాస్, కిష్టప్ప, నాగరాజు, పెద్దన్న, నల్లప్ప, భాస్కర్‌రెడ్డి, నారాయణవలి, నరేష్, విశ్వనాథ్, నరహరి పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి ఆలయ ప్రారంభోత్సవం



వాల్మీకి మహర్షి విగ్రహాన్ని దర్శించుకున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంట గ్రామంలో నూతనంగా నిర్మించిన వాల్మీకీ మహర్షి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కూతురు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను ఘనంగా సత్కరించారు.

గ్రామస్తుల ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతులు



కోతకు గురైన రహదారికి మరమ్మతులు చేస్తున్న చిట్టూరు గ్రామస్తులు. (ఇన్‌సెట్‌లో) జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండలంలో మూడు రోజులు క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా చిట్టూరు గ్రామం సమీపంలో తరిమెలకు వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురైంది. దీంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. గమనించిన గ్రామస్తులు సర్పంచు ధనలక్ష్మి ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులను వాహనదారులు అభినందించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



పి.జలాలపురం వంకలో ఇసుక డంప్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ కౌలుట్లయ్య

శింగనమల: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. మండలంలోని పి.జలాలపురంలో 'ఇసుక డంప్' శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో స్పందించిన సీఐ గ్రామంలో పర్యటించారు. గ్రామ సమీపంలోని వంకలను పరిశీలించారు. ఒక చోట నిల్వ ఉన్న రెండు ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎవరైనా ఇసుక తరలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గ్రామసభలో ఉద్రిక్తత

యల్లనూరు: మండలంలోని వెన్నపూసపల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాలు.. వెన్నపూసపల్లిలో పంచాయతీ కార్యదర్శి మాబు సాహెబ్ అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు దీర్ఘకాలిక సమస్యలను గుర్తించి తీర్మానం చేసేందుకు రాసుకుంటుండగా టీడీపీ కార్యకర్త భైరవేశ్వరుడు అడ్డుగా దూరి ×నేను చెప్పింది రాసుకోవా.. ఏం నీకు వినడపడలేదా?₹ అని పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదం చేశాడు. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దిలీప్‌రెడ్డి తదితరులు అడ్డుకున్నారు. అధికారులతో పద్ధతిగా మాట్లాడు అని నచ్చచెబుతుండగా భైరవ వారికి ఎదురు తిరిగాడు. ఈక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎదురుదాడికి దిగారు. పోలీసులు సకాలంలో అక్కడకు చేరుకోవడంతో సమస్య సద్దుమణిగింది.

కత్రిమల వీఆర్‌ఏ మృతి

పామిడి: మండలంలోని కత్రిమల గ్రామానికి చెందిన వీఆర్‌ఏ కదిరప్ప(80) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, రెవెన్యూ సిబ్బంది వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.25 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. తహసీల్దార్ వెంట సీనియర్ అసిస్టెంటు నిజాం, వీఆర్‌ఏలు సుంకన్న, శంకరయ్య తదితరులున్నారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ

గార్లదిన్నె: సచివాలయ సిబ్బంది ద్వారా సెప్టెంబర్‌కు సంబంధించి లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తామని ఎంపీడీఓ విజయ భాస్కర్ తెలిపారు. శనివారం మండల స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, చివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు.

నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలి



జితేందర్‌సింగ్‌ను సన్మానిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కాంగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్ సింగ్ సూచించారు. శనివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎమరింగ్ ట్రెండ్స్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ది ఐటీ సెక్టార్ అనే అంశంపై నిపుణుల చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఔత్సాహిక ఐటీ నిపుణులకు అందుబాటులో ఉన్న అవకాశాలపై అమూల్యమైన సలహాలు సూచనలు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: ప్రాణాపాయంలో ఉన్న ఓ మహిళను శనివారం సకాలంలో పోలీసులు తాడిపత్రి ఏరియాకు తరలించి మానవత్వం చాటుకున్నారు. తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంత రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లాకు చెందిన గీత తాడిపత్రి పట్టణ సమీపంలోని ఐశ్వర్య విల్లాస్ వద్ద స్పృహ తప్పిపడిపోయింది. స్థానికులు 100కు సమాచారం ఇవ్వడంతో.. పోలీసులు వెళ్లి 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాపాయం నుంచి ఆమె బయటపడింది. అనంతరం ఆమెను పోలీసులు స్వస్థలానికి పంపారు.

నేటి నుంచి కృష్ణాష్టమి ఉత్సవాలు



అలంకరణలో బాలకృష్ణుడు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని క్రిష్ణ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి కృష్ణాష్టమి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు జరిగే వేడుకలను పరిసర ప్రాంతాల నుంచి వందలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకోనున్నారు. 25న స్వామికి అభిషేకాలు, అర్చనలు, 26న ఉత్సవమూర్తి ఊరేగింపు, రాత్రి 9గంటలకు సీనియర్ రంగస్థల కళాకరులచే పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రేపు కల్లూరులో..

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు.శనివారం వారు మాట్లాడుతూ 26వ తేదీ గ్రామంలో శ్రీకృష్ణుడిని కొలువు తీర్చి, 29న ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

వైభవంగా ఏడు శనివారాల వ్రతం



ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని చింతల వేంకటరమణస్వామి ఆలయంలో ఎనిమిదో వారం ఏడు శనివారాల వ్రతం వైభవంగా ముగిసింది. ప్రధాన అర్చకులు మురళీబట్టార్ నేతృత్వంలో మహిళలు సామూహిక వ్రతమాచరించారు. ఈసందర్భంగా ఆలయంలోని ప్రధాన ఆది దేవతలైన లక్ష్మీ సహిత చింతల వేంకటరమణస్వామికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆఖరి వారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ సుబ్రమణ్యం, ఆలయ సిబ్బంది ఆదినారాయణ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి పాదాలకు పూజలు



కలశాన్ని ఊరేగిస్తున్న భక్తులు

గుంతకల్లు రూరల్: శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా కసాపురం గ్రామ సమీపంలోని పెద్దబండ గుట్టలో వెలసిన నెట్టికంటుడి పాదాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈఓ భద్రాజీ, సర్పంచ్ అనిత ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆలయానికి చేరుకుని స్వామికి పూజలు చేశారు. అనంతరం అక్కడ నుంచి పల్లకీపై కలశాన్ని ఊరేగిస్తూ స్వామి పాదాలు వెలసిన పెద్దబండ గుట్ట వద్దకు చేరుకున్నారు. స్వామి పాదాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం కలశంలో స్వామిని ఆవాహనం చేసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. కలశంలో అవాహనం చేసిన స్వామి జలాన్ని నెట్టికంటి ఆంజనేయస్వామి మూల విరాట్ ముందు ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అలంకరణలో భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథస్వామి

తాడిపత్రి రూరల్: మండలంలోని ఆలూరుకోన, ఓబులేసు కోన శ్రావణ మాసం శనివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడాయి. ఆలూరు కోనలోని భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథస్వామి, ఓబులేసు కోనలోని లక్ష్మీ నరసింహ స్వామిని అర్చకులు వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. పలువురికి గాయాలు



గాయపడిన సాయికుమార్, చరణ్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వలి

గుత్తి/గుత్తి రూరల్: పట్టణంలోని కేపీఎస్ సినిమా థియేటర్ సమీపంలో శనివారం రెండు బైక్‌లు ఢీ కొని సాయి కుమార్, చరణ్ అనే యువకులు గాయపడ్డారు. పెద్దొడ్డి గ్రామానికి చెందిన వారు బైక్‌లో అనంతపురం రోడ్డు వైపు వెళ్తుతుండగా ఎదురుగా మరో బైక్ ఢీ కొంది. ఘటనలో గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

- గుత్తి పట్టణ శివారులోని గుత్తి–అనంతపురం రోడ్డులో బైక్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో వలి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రొద్దుటూరుకు చెందిన వలి పెద్దవడుగూరులో వివాహానికి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది గాయపడిన వలిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు అనంతపురం రెఫర్ చేశారు.
- గుత్తి మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడి మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుంతకల్లు పట్టణంలోని మోదీనాబాద్‌కు చెందిన మనోహర్‌రెడ్డి కర్నూలు నుంచి ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.
- గుత్తి మండలంలోని తొండపాడు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ద్విచక్రవాహనం బోల్తా పడి హరిత అనే మహిళ తీవ్రంగా గాయపడింది. గుత్తి పట్టణానికి చెందిన హరిత క్రిష్టపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్నారు. ఆమె గుత్తి నుంచి క్రిష్టపాడుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా తొండపాడు గ్రామ శివారులో రోడ్డుపై కుక్క అడ్డు వచ్చింది. కుక్కను బైక్ ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో హరిత తీవ్రంగా గాయపడగా కుక్క మృతి చెందింది. హరితను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.